క్లుప్తంగా

'ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్'



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని జల్లి గ్రామంలోని ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం 'ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ఎంఈఓ బైరి సరళ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశంలో భిన్నత్వంలో ఏకత్వం గురించి, సాంప్రదాయాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరాచారి, జగన్‌మోహన్, వెంకటేశ్వరరావు, సరిత, శైలజ, అశోక్, భిక్షపతి, సుభాష్, సీఆర్పీ శిల్ప, తదితరులు పాల్గొన్నారు.

'అగ్నివీర్'కు విద్యార్థుల ఎంపిక

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్‌లోని సైనిక్ స్కూల్‌కు చెందిన డిగ్రీ విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అగ్నివీర్ స్కీమ్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గట్ల సురేందర్ తెలిపారు. స్కూల్ ఆవరణలో సదరు విద్యార్థులను శుక్రవారం ఆయన అభినందించి మాట్లాడారు. డిగ్రీ చదువుతున్న అభిలాష్, రాజేందర్, సాయికుమార్, ఆనంద్, అంజి, ఆకాశ్, శ్రావణ్, ఈశ్వర్ ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనివాసస్వామి, ఉప్పలయ్య, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విరాళం



పర్వతగిరి : మండలంలోని వడ్లకొండ రంగనాయకులస్వామి గుట్ట ప్రాంగణంలో చేపట్టిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ విగ్రహాల కోసం ఆలయ కమిటీ బాధ్యుడు అమరగాని రాజుకు గ్రామానికి చెందిన తోపుచెర్ల సావిత్రి రామారావు, శ్వేత వేణుగోపాల్, సునీత అనిల్ రావు, చందన ప్రవీణ్‌రావు దంపతులు శుక్రవారం రూ.3,01,116 విరాళం అందజేశారు. అనంతరం రాజు మాట్లాడారు. ఆలయ నిర్మాణంలో భక్తులు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు రవీందర్, దేవేందర్, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాల్వలో మృతదేహం లభ్యం



కృష్ణకాంత్ (ఫైల్)

రాయపర్తి : చేపల వేటకు వెళ్లిన యువకుడు ఎస్సారెస్పీలో శవమై తేలిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రవణ్‌కుమార్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కృష్ణకాంత్ (29) ఈనెల 25న స్థానిక ఎస్సారెస్పీ కెనాల్‌లో చేపలవేటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు స్నేహితుల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా శుక్రవారం ఉదయం ఎస్సారెస్పీ కాల్వలో శవం తేలినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు శవాన్ని బయటకు తీయగా కృష్ణకాంత్ మృతదేహంగా గుర్తించారు. కృష్ణకాంత్ ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృతి చెందినట్లు భావిస్తున్నారు. మృతుడి తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



ప్రవళిక మృతదేహం

దుగ్గొండి : ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తొగర్రాయిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన నల్ల సుధాకర్ కూలీ పనులకు వెళ్లగా మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అతడి భార్య ప్రవళిక (27) ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు గమనించి కిందకు దించగా అప్పటికే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు. ప్రవళిక ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతురాలి తల్లి చిలువేరు రాధ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నల్లబెల్లి : జిల్లా పరిధిలోని నెక్కొండ మండలంలోని సూరిపెల్లి గ్రామానికి చెందిన యువకుడు రుద్రగూడెం శివారులో శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలిలా.. వీరస్వామి బతుకుదెరువు కోసం ఇటీవల శనిగరం గ్రామానికి వచ్చి కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయన ఆత్మహత్యకు యత్నించి అపస్మారక స్థితికి చేరుకోగా స్థానికులు గమనించి 108కు సమాచారం అందించి నర్సంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వీరస్వామిని కుటుంబీకులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. వీరస్వామి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

ప్రభుత్వాస్పత్రిలో డ్రెయినేజీ కంపు

- పాత భవనంలో దుస్థితి
- రోగులు, వైద్యులు, సిబ్బందికి ఇబ్బందులు



నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రి పాత భవనం

నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రి (పాత భవనం)లో డ్రెయినేజీ కంపుకొడుతోంది. ఎప్పటికప్పుడు తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్నప్పటికీ రెండ్రోజులకోసారి మురుగు బయటకు వస్తుండడంతో ఇన్‌పేషెంట్లతోపాటు అటెండెంట్లు, వైద్యులు, సిబ్బందికి తిప్పలు తప్పడం లేదు.

1999లో నర్సంపేటలో 50 పడకలతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మించారు. అనంతరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా, ఏరియా ఆస్పత్రిగా, జిల్లా ఆస్పత్రిగా, వైద్య కళాశాల ప్రభుత్వ ఆస్పత్రి అప్‌గ్రేడ్ అవుతూ వచ్చింది. ఇటీవల ప్రభుత్వం ఆస్పత్రి, మెడికల్ కళాశాలకు నూతన భవనాలు నిర్మించింది. పనులు ఇంకా పనులు కొనసాగుతున్న క్రమంలో పాత భవనంలో ఇన్‌పేషెంట్ (ఐపీ) సేవలు అందుతున్నాయి. ఓపీతోపాటు ఇతర సేవలు నూతన భవనంలో కొనసాగుతున్నాయి. అయితే పాత భవనంలో సుమారు 100 మంది రోగులు ఇన్‌పేషెంట్లుగా సేవలు పొందుతున్నారు. ప్రతిరోజూ వారికి సపర్యలు చేసేందుకు అటెండెంట్స్ ఉంటారు. కాగా ఆస్పత్రి ఎదుట దశాబ్దాల క్రితం నాటిన మొక్కలు ప్రస్తుతం మహావృక్షాలుగా ఎదగడంతో వాటి వేర్లు భూమిలోని ఆస్పత్రి డ్రెయినేజీ మీదుగా చొచ్చుకుపోయాయి. దీంతో డ్రెయినేజీ నుంచి మురుగునీరు బయటకు వెళ్లక జామ్ అవుతోంది. ఈ క్రమంలో రెండ్రోజులకోసారి మురుగు బయటకు వస్తుండడంతో వాహనాల పార్కింగ్, ఇన్‌పేషెంట్ గదులు, వైద్యసేవలు అందించే గదులు కంపుకొడుతున్నాయి. మురుగునీరు బయటకు వచ్చినప్పుడల్లా సూపర్‌వైజర్లు, సిబ్బంది తాత్కలికంగా మరమ్మతులు చేయిస్తున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు చొరవ తీసుకుని శాశ్వత ప్రాతిపదికన సమస్య పరిష్కరించాలని రోగులు, వైద్యులు, సిబ్బంది కోరుతున్నారు.



గేట్‌వాల్వ్ నుంచి బయటకు వచ్చిన మురుగు

ఉన్నతాధికారులకు నివేదించాం



చెట్ల వేర్లు భూమిలోకి చొచ్చుకుపోవడంతో డ్రెయినేజీ పైపులు పూర్తిగా పగిలిపోయాయి. దీంతో గేట్‌వాల్స్ నుంచి మురుగు రెండ్రోజులకోసారి బయటకు వస్తోంది. సిబ్బందితో తాత్కాలికంగా మరమ్మతులు చేయించి దుర్వాసన నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. శాశ్వత పరిష్కారం కోసం సమస్యను ఉన్నతాధికారులకు నివేదించాం. అనుమతులు రాగానే నూతన డ్రెయినేజీ నిర్మాణానికి చర్యలు చేపడతాం.

– డాక్టర్ కిషన్, ఆస్పత్రి సూపరింటెండెంట్

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



సంగెం: ఇఫ్తార్ విందులో ముస్లింలు, నాయకులు



గీసుకొండలో..

సంగెం : మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్‌ను తహసీల్దార్ రాజ్‌కుమార్ అభివర్ణించారు. మండల కేంద్రంలోని జామా మసీదులో ప్రభుత్వం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సై నరేశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు జనగాం రమేశ్, మెట్టుపల్లి రమేశ్, కేశవులు, వెంకటేశ్వర్లు, ఆగపాటి రాజు, సాంబయ్య, కవిత, ఖాజా పాషా, యాకూబ్, ఇస్మాయిల్, రియాజ్, సోహెల్, తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ : మండల కేంద్రంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి సహకారంతో ఆ పార్టీ నాయకులు వీరగోని రాజ్‌కుమార్, రడం భరత్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రడం శ్రీధర్, మాజీ సర్పంచ్ కోల కుమారస్వామి, నాయకులు దౌడు బాబు, జోలె చిన్ని, పాగాకు భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

షబే ఖదర్ వేడుకలు

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని పాత ముగ్దుంపురం గ్రామంలోని మజీదే మహ్మదీయ మసీదులో షబే ఖదర్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇమామ్ ఇజాస్ ఖురాన్‌లోని ప్రవచనాలను చదివి వినిపించారు. ముస్లిములందరూ దైవ చింతనను అలవర్చుకోవాలని సూచించారు. అర్ధరాత్రి వరకు ప్రత్యేక ప్రార్థన (నమాజ్) నిర్వహించారు. అనంతరం నర్సంపేటకు చెందిన మసూద్ ఇమామ్ ఇజాస్, మౌజన్ షేక్ మహ్మద్‌లను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మసీద్ సదర్ షేక్ యాకూబ్ పాషా, మహద్ కయాజ్, పటాన్ వలి, షేక్ వలి, హుస్సేన్, అంకూస్, సయ్యద్ బషీర్, జానీ, పటాన్ యాకూబ్, మదార్, అక్రమ్, కయ్యూం, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు

నర్సంపేట : నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌కు నేటి నుంచి నాలుగు రోజులపాటు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 29న అమావాస్య, 30న ఉగాది పండుగ, 31న రంజాన్, ఏప్రిల్ 1న మంగళవారం సందర్భంగా నాలుగు రోజులు మార్కెట్ బంద్ ఉంటుందని పేర్కొన్నారు.

6న కల్యాణం

ఖిలా వరంగల్ : పుప్పాలగుట్టలోని ముత్యాలమ్మ ఆలయంలో ఏప్రిల్ 6న శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణం నిర్వహిస్తామని సామాజిక వేత్త శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నర్సంపేట రూరల్ : తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన నర్సంపేటలోని టీచర్స్ కాలనీలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై రవికుమార్ కథనం ప్రకారం.. టీచర్స్ కాలనీకి చెందిన తండా సారంగపాణి ఈనెల 5న చెన్నైలో నివాసం ఉంటున్న కుమారుడి ఇంటికి కుటుంబ సమేతంగా వెళ్లారు. ఈనెల 26న సారంగపాణి ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని ఇంటి పక్క కుటుంబీకులు గుర్తించి సారంగపాణికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో సారంగపాణి శుక్రవారం ఇంటికి చేరుకోగా చోరీ వెలుగులోకి వచ్చింది. దుండగులు ఇంటి, ప్రహరీ గేటు తాళాలు పగులగొట్టి బీరువాలో ఉంచిన అరతులం బంగారం, మూడున్నర తులాల వెండి అపహరణ గురైనట్లు గుర్తించారు. చోరీకి గురైన సొత్తు విలువ రూ.49500 ఉంటుందని, సారంగపాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

'రేషన్' సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలి



సంగెం : ఆహార భద్రత రేషన్ కార్డుల సర్వే నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ఎంపీడీఓ రవీందర్‌కు మండల పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు యాదగిరి మాట్లాడారు. ప్రస్తుతం గ్రామాల్లో తాగునీటి సరఫరాతోపాటు ఎల్ఆర్ఎస్, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు సర్వేలు నిర్వహిస్తూనే ఇంటి పన్నుల వసూలు, ఉపాధి హామి పనులు చేయిస్తూ అదనంగా ప్రభుత్వ పనుల భారంతో తాము సతమతమవుతున్నామని చెప్పారు. మళ్లీ ఆహార భద్రత కార్డుల సర్వే చేయాలంటే చాలా ఇబ్బంది అవుతుందని తెలిపారు. తమకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పంచాయతీ కార్యదర్శులు రమేశ్, శరత్, రవీందర్ తదితరులున్నారు.

నివాళి

పర్వతగిరి : మండలం ఏనుగల్‌కు చెందిన తక్కళ్లపల్లి సుభద్రదేవి (90) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుమారులైన నారాయణరావును, భాస్కర్‌రావును పరామర్శించారు.

టేకులతండాలో..

మండలంలోని ల్యాబర్తి శివారు టేకులతండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు వెంకట్రాం (70) శుక్రవారం మృతి చెందగా ఆయన మృతదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వెంకట్రాం అందించిన సేవలను గుర్తు చేశారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

భర్త ఆత్మహత్య కేసులో భార్య, అత్తామామ అరెస్ట్

నర్సంపేట రూరల్ : భర్త ఆత్మహత్య చేసుకున్న కేసులో అందుకు బాధ్యులైన మృతుడి భార్య, అత్తామామలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నర్సంపేట రూరల్ ఎస్సై గూడ అరుణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నర్సంపేట మండలంలోని జంగాలపల్లితండాకు చెందిన భూక్య సుమన్‌కు మరిపెడ మండలంలోని యార్లగడ్డ తండాకు చెందిన లూనావత్ కల్యాణితో ఏడేళ్ల క్రితం వివాహం అయ్యింది. ఇద్దరు కుమారులు కలిగారు. భార్యభర్తల మధ్య గొడవలు చోటు చేసుకోవడంతో కల్యాణి పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమె కాపురానికి రాకపోగా ఇల్లరికం రావాలని దూషించడంతో తీవ్ర మానసిక వేదనకు గురై సుమన్ జనవరి 2న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అనంతరం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి అదే నెల 4న మృతి చెందాడు. సుమన్ సూసైడ్ నోట్ ఆధారంగా సాక్ష్యాధారాలు సేకరించి అతడి మృతికి కారకులైన కల్యాణిని, ఆమె తల్లిదండ్రులైన భద్రమ్మ లింగ్యాలను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

ఖిలా వరంగల్ : అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని స్థానిక కార్పొరేటర్ వేల్పుకొండ సువర్ణ సూచించారు. శుక్రవారం 37వ డివిజన్ తూర్పు కోటలో రూ. 25లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. స్మార్ట్ సిటీ నిధులతో అంతర్గత రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నానని తెలిపారు.కార్యక్రమంలో బోగి సురేశ్, దూడయ్య, చందర్, రఘు, రవికుమార్ పాల్గొన్నారు.

నేడు పీఏసీఎస్ మహాసభ

ఖిలా వరంగల్ : మండల పీఏసీఎస్ భవనంలో నేడు (శనివారం) వార్షిక మహాసభ నిర్వహిస్తామని సంఘం అధ్యక్షుడు కేడల జనార్దన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు. ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ జగన్‌మోహన్‌రావు హాజరుకానున్నారని, ప్రతి సభ్యుడి విధిగా హాజరై సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పకడ్బందీగా 'ఆహార భద్రత' సర్వే



సంగెం: మాట్లాడుతున్న తహసీల్దార్ రాజ్‌కుమార్



దుగ్గొండి: మాట్లాడుతున్న తహసీల్దార్ రవిచంద్ర

- తహసీల్దార్ రాజ్‌కుమార్

సంగెం : ఆహర భద్రత కార్డుల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రాజ్‌కుమార్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మండలంలో 3 వేల 76 మంది లబ్దిదారులు ఆహారభద్రత కార్డుల కోసం ప్రజాపాలన, మీసేవా, సమగ్ర సర్వే తదితరాల ద్వారా దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తుదారుల వివరాలు గ్రామాల వారీగా యాప్‌లో నమోదై ఉన్నాయని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు స్వయంగా లబ్దిదారుల ఇళ్లను సందర్శించి ఆర్థిక స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. రిమార్క్ కాలంలో అర్హత/అనర్హత స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. అనర్హులకు రాకుండా, అర్హులందరికీ కార్డులు అందేలా బాధ్యతగా సర్వే చేయాలని ఆకాంక్షించారు. సమావేశంలో ఎంపీడీఓ రవీందర్, ఏంపీఓ కొమురయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

10 రోజుల్లో పూర్తి చేయాలి

దుగ్గొండి : ఆహార భద్రత కార్డుల సర్వేను 10 రోజుల్లో పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను తహసీల్దార్ రవిచంద్రరెడ్డి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలవ్యాప్తంగా 3800 మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి వివరాలతోపాటు ఫొటోలు ట్యాబ్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. తొలగింపులు, చేర్పులు దరఖాస్తుదారుల ఎదుట పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ లెక్కల అరుంధతి, డిప్యూటీ తహసీల్దార్ ఉమారాణి,. తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'దొంతి'కి మంత్రి పదవి ఇవ్వాలి

- టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్



నర్సంపేట : మాట్లాడుతున్న రామానంద్

నర్సంపేట : స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ పార్టీ అధిష్టానాన్ని కోరారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాధవరెడ్డి సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి సొసైటీ చైర్మన్, డీసీసీబీ చైర్మన్, పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా, టీపీసీసీ సభ్యుడిగా, ఏఐసీసీ సభ్యుడిగా పదవులు నిర్వహించారని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ఆర్ పాదయాత్రలో కీలకపాత్ర పోషించి 2004 ఎన్నికల్లో పొత్తులో భాగంగా టీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డికి టికెట్ ఇచ్చినా బాధపడకుండా ఆయన గెలుపులో కీలకపాత్ర పోషించాడని తెలిపారు. 2014 ఎన్నికల్లో మాధవరెడ్డికి టికెట్ ఇవ్వకపోతే ప్రజల, పార్టీ శ్రేణుల కోరిక మేరకు స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి గెలిచి అనంతరం టీఆర్ఎస్ ప్రలోభాలకు గురికాకుండా అగ్రనేత రాహుల్‌గాంధీ సమక్షంలో ఢిల్లీలో పార్టీలో చేరినట్లు వివరించారు. త్వరలో మరో ఆరు మంత్రి పదవులు కేటాయించనున్న క్రమంలో రాజకీయ నిబద్ధతకు, నిజాయితీకి నిదర్శనంగా నిలుస్తున్న క్రమంలో మాధవరెడ్డికి అవకాశం ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, ఉపాధ్యక్షుడు భూసాని సుదర్శన్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తుమ్మలపల్లి సందీప్, నాయకులు భీరం భరత్‌రెడ్డి, చిప్ప నాగ, మురళి తదితరులు పాల్గొన్నారు.

బద్దిపోచమ్మ ఆలయంలో పూజలు

నల్లబెల్లి : నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి మంత్రి పదవి రావాలని కోరుతూ మండలంలోని పోచంపల్లి బద్దిపోచమ్మ ఆలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మాధవరెడ్డిని మంత్రి పదవి వరించాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుషోత్తం సురేశ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ మామిండ్ల రాజిరెడ్డి, ఎన్ఎస్‌యూఐ డివిజన్ అధ్యక్షుడు బేతి భరత్, రుద్రగూడెం గ్రామ కమిటీ అధ్యక్షుడు అజ్మీర తిరుపతి, మాజీ ఉపసర్పంచ్ బైకాని శివకోటి, నాయకులు గద్దల సురేశ్, చోటూ, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

- బీసీ రాజ్యాధికార సమితి కార్యదర్శి రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్ బిల్లుపై చట్టం చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని బీసీ రాజ్యాధికారి సమితి రాష్ట్ర కార్యదర్శి ముంజాల రాజేందర్‌గౌడ్ కోరారు. పట్టణంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగ రవియాదవ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశంలో రాజేందర్ మాట్లాడారు. విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందంపై హర్షం వ్యక్తం చేశారు. సదరు బిల్లును కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్‌లో చేర్చితే బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో లభిస్తాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా కోట కింద 33 శాతం బీసీ మహిళల వాటా బిల్లులోనూ తేల్చాలని ఆకాంక్షించారు. సమావేశంలో బీసీ రాజ్యాధికార సమితి స్థానిక కన్వీనర్ కొండ శ్రీశైలం, బాధ్యులు కుండె ప్రభాకర్, కుస రాజేందర్, రామగిరి నాగరాజు, నల్ల సుమన్, కల్లావు విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కోటకు కొత్త సొబగులు

- ప్రగతి బాటకు ప్రణాళికలు
- కలెక్టర్, కుడా చైర్మన్ పర్యటనతో చిగురిస్తున్న ఆశలు
- ఏకశిల పార్క్ విస్తరణ, గుండుచెరువు సుందరీకరణ.



ఇటీవల కోటలో పర్యటిస్తున్న కలెక్టర్ సత్యశారద, కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి, అధికారులు

ఖిలా వరంగల్ : చారిత్రక ప్రసిద్ధి చెందిన కాకతీయుల రాజధాని ఖిలా వరంగల్ కోటకు మహర్దశ పట్టనుంది. దీంతో కోటకు కొత్త సొబగులు సంతరించుకోనుంది. ప్రపంచ పర్యాటకులు ఆకర్శించే స్థాయిలో తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో పర్యాటక అభివృద్ధికి బాటలు పడుతున్నాయి. అభివృద్ధితో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలతో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, కలెక్టర్ సత్యశారద చేపట్టిన పర్యటనతో అభివృద్ధిపై ఆశలు చిగురిస్తున్నాయి. ఎంపిక చేసిన ఏకశిల గుట్ట, గుండు చెరువు, రాతికోట అభివృద్ధితో పాటు అగర్త చెరువులో బోటింగ్ షికారు, ఏకశిల చిల్డ్రన్స్ పార్క్ సుందరీకరణ, కాటేజీల నిర్మాణం, శిల్పాలను వరస క్రమంలో పేర్చటానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కోటను మరింత అభివృద్ధి చేసి కొత్త అందాలు తీసుకురానున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. రూపొందించే ప్రణాళికలతో రాతి కోట చుట్టూరా పర్యాటకులు బోట్ షికారు చేయటం, సందర్శకులను ఆకర్శించే విధంగా పార్క్ విస్తరణ, గుండు చెరువు చుట్టూ పాత్‌వే నిర్మాణం. ఖుషిమహల్ పక్కనే ఉన్న స్థలం ఫుడ్‌కోర్టు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని కుడా చైర్మన్ తెలిపారు.

అగర్త చెరువులో బోట్ షికారు..

ఇప్పటి వరకు గుండు చెరువుకే పరిమితమైన బోటింగ్ రాతి కోట చుట్టూ అగర్త చెరువుల్లో పర్యాటకులు షికారు చేయనున్నారు. ఇటీవల కలెక్టర్, కుడా, టూరిజం జిల్లా అధికారులతో కలిసి కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి మధ్యకోటలో పర్యటించారు. చేయాల్సిన అభివృద్ధిపై ప్రతిపాదనలు సిద్ధంచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

ప్రణాళికలు రూపొందిస్తున్నాం

పర్యాటక ప్రాంతాల సుందరీకరణ కోసం కోటను ఎంపిక చేశాం. ఒక్క రోజు టూరిస్ట్ ప్యాకేజీలో కోటను చేర్చాము. ప్రపంచ పర్యాటకులను ఆకర్శించే స్థాయిలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. ప్రకృతి ఒడిలో పర్యాటకులను మైమరిచిపోయే విధంగా అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ఆదేశించాం. ప్రభుత్వ అనుమతులతోనే అభివృద్ధికి త్వరలోనే శ్రీకారం చుడుతాం.

– ఇనుగాల వెంకట్రాంరెడ్డి, కుడా చైర్మన్

2 నుంచి కుంభాభిషేకం

ఖిలా వరంగల్ : ఏప్రిల్ 2 నుంచి 4 వరకు శివనగర్ రామాలయంలో కుంభాభిషేకం నిర్వహిస్తామని ఆలయ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి మంచాల కృష్ణమూర్తి తెలిపారు. ఆలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలయ ట్రస్ట్ సభ్యులతో కలిసి కుంభాభిషేకం కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రామాలయ, రామలింగేశ్వరస్వామి, లలితాదేవి, పంచముఖ ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల శిఖరాల స్థాపన చేసి 12 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథులుగా శ్రీదత్త విజయానంద తీర్థ స్వామిజీ, మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, నగర మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్లు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో రావికంటి అశోక్, శ్రీరాంరాజేష్, యాదగిరి, నవీన్, సుధాకర్, వెంకన్న, ఆడేపు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.